క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్ రూరల్: మండల పరిధి కొడంగల్, రావులపల్లి, టేకుల్‌కోడ్, పెద్దనందిగామ సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో సిబ్బంది శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 4గంటల వరకు సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



రహదారి పక్కన చెత్తను తొలగిస్తున్న కార్మికులు

కొడంగల్ రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని శాంతినగర్ సమీపంలో పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ అనంతరం ఆయన మాట్లాడారు. అపరిశుభ్రతతో దోమలు పెరిగి వ్యాధులు ముసిరే ప్రమాదం ఉందని, ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పారిశుద్ధ కార్మికులకు సూచించారు.

ముగిసిన వధశాల వేలం



వేలం పాటలో చైర్‌పర్సన్, కమిషనర్, హక్కుదారులు

తాండూరు టౌన్: మున్సిపల్ పరిధిలోని వధశాల (మేకలు, గొర్రెలు)తో పాటు బీఫ్ కటింగులకు వేర్వేరుగా శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో పురపాలికకు రూ.96 వేల ఆదాయం సమకూరింది. జూలై 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ వరకు మేకలు, గొర్రెలు, బీఫ్‌లకు వేర్వేరుగా చార్జీలను వసూలు చేసుకోవచ్చని కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన ఎండీ మజీద్ రూ.46 వేలకు (జీవాలు), అబ్దుల్ ఖయ్యూం ఖురేషీ రూ.50 వేలకు బీఫ్ హక్కులను దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు.

అండగా ఉంటా..



నాగప్పను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బీఎమ్మార్

తాండూరు రూరల్: అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పార్టీ తాండూరు మండల అధ్యక్షుడు జెన్నె నాగప్పను శనివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పరామర్శించారు. అ. ధైర్య పడొద్దు.. అండగా ఉంటానని నాగప్పకు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కరణం పురుషోత్తంరావు ఉన్నారు.

విద్యుత్ సమస్యలపై దృష్టి

కుల్కచర్ల: విద్యుత్ సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ట్రాన్స్‌కో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నెలకొంటున్న కరెంటు సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అయ్యే ఖర్చులు, కార్యాచరణను నిర్దేశించి జిల్లా అధికారులకు నివేదిక అందజేయాలని సూచించారు. తాత్కాలిక సమస్యలను గ్రామపంచాయతీ నుంచి పరిష్కరించే ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖరీం, విద్యుత్ అధికారులు రమేష్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఎస్సై కిషన్‌సింగ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ సమీపంలో గల పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాలలో నూతన విద్యార్థి సంఘం ఎన్నికల వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పల్లవి ఇంటర్‌నేషనల్ పాఠశాల విద్యాసంస్థల చైర్మన్ మల్క కొమురయ్య, సీఈఓ యశస్వి మల్క, మొయినాబాద్ ఎస్సై కిషన్‌సింగ్‌లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి నూతన విద్యార్థి సంఘాన్ని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాబోధనతో పాటు విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలంటే విద్యార్థులకు న్యాయకత్వ లక్షణాలు ఎంతో అవసరమని సూచించారు. పాఠశాలలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం యమ మాధభూషి, సీసీఏ ప్రియాంక మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊరూరా 'ఏరువాక' సందడి

ప్రత్యేక అలంకరణలో ఎడ్లబండ్ల ఊరేగింపు



పూడూరు: మిట్టకంకల్‌లో ఎండ్లబండితో రైతులు

పల్లెల్లో పండుగ సందడి నెలకొంది. ఏరువాక పున్నమితో శోభాయమానంగా మారాయి. ఏరువాక సాగారో రన్నో.. చిన్నన్న.. అంటూ జిల్లాలో రైతులు రెండు రోజులుగా ఏరువాక పౌర్ణమిని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఎద్దులు, బండ్లను ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యంగా పొంగలి వండి ఎడ్లకు తినిపించారు. డప్పు చప్పుళ్ల మధ్య ఎడ్ల బండ్లను వీధుల్లో ఊరేగిస్తూ సందడి చేశారు. ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పలువురు మాట్లాడారు. విత్తనాలు విత్తే ముందు వచ్చే ఏరువాక పౌర్ణమిని ఏటా ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. – సాక్షి, నెట్‌వర్క్



దుద్యాల్: చెట్టుపల్లి తండాలో ఆలయం చుట్టూ ఎండ్లబండ్లు, వాహనాలతో ప్రదక్షిణలు

కరుగుతున్న కాలం.. కర్షకుల కలవరం

- వేసిన విత్తనం భూమిలోనే..
- స్ప్రింక్లర్లతో పొలం తడుపుతున్న రైతులు



ఎక్కచెరువు తండాలో విత్తనం మొలకెత్తకపోవడంతో స్ప్రింక్లర్ల ద్వారా నీరు అందిస్తున్న రైతు

దుద్యాల్: కరిగిపోతున్న కాలం.. కర్షకులను కలవరపెడుతోంది. వానాకాలం సీజన్ మొదట్లో కురిసిన తొలకరి జల్లులతో పులకరించిన రైతులు.. ఆనందంగా విత్తులు విత్తారు. కానీ.. ఆ ఆనందం వారం రోజులకే ఆవిరై పోయింది. వరుణుడు ముఖం చాటేయడం.. భానుడు ఉగ్రరూపం దాల్చుతుండటంతో వేసిన విత్తనాలు వేసినట్లే పుడమి తల్లి ఒడిలో ఒదిగి పోయాయి. నీటి తడులు ఎక్కువగా ఉన్న పొలాల్లో విత్తనం కాస్త మొలకెత్తినా.. తడి తక్కువగా ఉన్న మడుల్లో మాత్రం వేసిన విత్తనాలు భూమిలోనే ఉండిపోయాయి. దీంతో చేసేదేమిలేక బోర్లు అందుబాటులో ఉన్న రైతులు స్ప్రింక్లర్ల సహాయంతో పొలానికి నీటి తడులు అందిస్తున్నారు. వర్షాకాలం కదా, వానలు కురుస్తాయనే ఆశతో అన్నదాతలు.. పత్తి, కంది, పెసర, బెబ్బర్లు, మొక్కజొన్న తదితర పంటల సాగుకు క్షేత్ర స్థాయిలో సిద్ధమైనా.. చినుకు పడకపోవడంతో చిన్నబోయి.. ఆకాశం వైపు దీనంగా చూడటం గమనార్హం.

రుణమాఫీ నిర్ణయం హర్షణీయం



తాండూరు: సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్, నాయకులు

తాండూరు: కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒకే దఫా రూ.2లక్షల రైతుల రుణమాఫీ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్ అన్నారు. శనివారం తాండూరు, యాలాల మండల ప్రజా ప్రతినిధులతో కలిసి ఆమె మాట్లాడారు. రైతులకు అభ్యున్నతి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని, సీఎం ప్రకటించిన తేదీలోపు రైతులను రుణ విముక్తులను చేయడం సంతోషించదగిన విషయమన్నారు. సమావేశంలో డీసీఎంఎస్ డైరెక్టర్ రవిగౌడ్, యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు విజయాదేవి, ప్రభాకర్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ జుబేర్‌లాల, పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, నాయకులు బాతుల నాగరాజ్ తదితరులున్నారు.

సంబురాలు చేసుకోండి

ధారూరు: రూ.2లక్షల రైతుల రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని పీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి అన్నారు. రైతులతో కలిసి పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

రవాణా సౌకర్యం మెరుగు పర్చండి



ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రవాణా సౌకర్యం మెరుగు పర్చండి అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆర్టీసీ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న బస్సు సమస్యలను ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యాసంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల నుంచి పట్టణానికి పెద్దఎత్తున విద్యార్థులు చదువుకునేందుకు వస్తుంటారని తెలిపారు. విద్యార్థులకు సమయానికి అనుకూలంగా బస్సు సౌకర్యాన్ని కల్పించాల్సిన బాధ్యత ఆర్టీసీ అధికారులపై ఉందని సూచించారు. ఏ గ్రామానికి బస్సు సమస్య రావొద్దని, పాత రూట్లలో బస్సు సర్వీసులను తిరిగి ప్రారంభించాలని సూచించారు. బస్సుల కొరత ఉన్నందున కొత్తగా ఏడు బస్సులను ప్రభుత్వం షాద్‌నగర్ డిపోకు కేటాయించిందన్నారు. త్వరలో మరో ఏడు బస్సులు రానున్నట్లు తెలిపారు. డిపోలో సిబ్బంది కొరత విషయమై మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సిబ్బంది కొరతను అధిగమించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో ఆర్టీసీ డిపో మేనేజర్ ఉష, అధికారులు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్ మేళా

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో ఆదివారం మెగా జాబ్‌మేళా చేపట్టనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గౌలికార్ నర్సింగ్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10గంటల నుంచి మేళా ఉంటుందని పేర్కొన్నారు. చదువును బట్టి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలని వివరించారు. కావున నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9642333668, 9030047303లో సంప్రదించాలన్నారు.

'మాదిగల ఆత్మగౌరవ కవాతు'కు తరలిరండి

పరిగి: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ ఉత్సవాలను పురస్కరించుకుని జులై 7న నిర్వహించే 'మాదిగల ఆత్మగౌరవ కవాతు'కు భారీగా తరలిరావాలని సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్‌మాదిగ పిలుపునిచ్చారు. శనివారం పట్టణ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమితి ఆవిర్భవించి 30 సంవత్సరాలు పూర్తవుతుందని, అదే విధంగా వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి మాదిగలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సమితి మండల ఇన్‌చార్జి అశోక్, నాయకులు నర్సింలు, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

25న తైబజార్ వేలం

ధారూరు: తైబజార్ బహిరంగ వేలం పాటను ఈ నెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు ధారూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి అంజ్యానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శనివారం కూరగాయల మార్కెట్‌లో రైతులు, వ్యాపారులు కూరగాయల క్రయ, విక్రయాలు జరుపుతారని, వారి నుంచి నిర్ణీత రుసుమును వసూలు చేసుకునేందుకు వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. జీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10:30 గంటలకు వేలం పాట ప్రారంభమౌతుందని, ఆసక్తి గల వారు తొలుత రూ.10 వేలను ధరావతు కింద చెల్లించాలని సూచించారు. వేలంలో పాల్గొనే వారికి ఎలాంటి పంచాయతీ బకాయలు ఉండరాదని స్పష్టంచేశారు.

నూతన కమిటీ ఎన్నిక

కుల్కచర్ల: మత్స్యకార గ్రామ సంఘాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ శాఖ జిల్లా ఎలక్షన్ ఆఫీసర్ రామకృష్ణ ఆధ్వర్యంలో కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా కాటనిపల్లి అంజిలయ్య, ఉపాధ్యక్షుడిగా శావుకు చెన్నయ్య, కార్యదర్శిగా బూరకొండ నర్సింలు, మరో ఏడు మంది డైరెక్టర్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అంజిలయ్య మాట్లాడారు. అందరి సహకారంతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో చాపలగూడెం మాజీ సర్పంచ్ లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహ సంక్షేమ అధికారి శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు హాస్టల్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. హాస్టల్‌లో 35 సీట్లు మాత్రమే ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు ఆధార్ జిరాక్స్, మూడు ఫొటోలు, కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, పాఠశాల బోనోఫైడ్ సర్టిఫికెట్లతో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళాశాల సిబ్బంది

షాద్‌నగర్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నట్లు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ రెడ్డి అన్నారు. దోస్తు నోటిఫికేషన్ వెలుబడిన నేపథ్యంలో షాద్‌నగర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ప్రవేశాల కోసం శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కల్పిస్తున్న సదుపాయాల గురించి విద్యార్థులకు వివరించి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నాక్ బీ ప్లస్ గ్రేడ్ సాధించిందని, విద్యార్థులకు అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌తో పాటుగా ప్రొజెక్టర్లతో ఎంతో అనుభవం ఉన్న అధ్యాపకులతో పాఠాలను బోధిస్తున్నట్లు తెలిపారు. పోటీపరీక్షలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని, కళాశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. దోస్తు నోటిఫికేషన్ వెలుబడిన నేపథ్యంలో విద్యార్థులు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మొదటి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కేఎల్ డీమ్డ్ టూబీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పార్థసారధివర్మ



కరాటే, యోగాలో పాల్గొన్న విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు కరాటేతో పాటు యోగ ఆసనాలు చేసినప్పుడే శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడానికి ఎంతో దోహదపడుతుందని కేఎల్ డీమ్డ్ టూబీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పార్థసారధివర్మ అన్నారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామ సమీపంలో గల కేఎల్ డీమ్డ్ టూబీ యూనివర్సిటీ కళాశాలలో కరాటేతో పాటు యోగా కార్యక్రమాలను వారంరోజులుగా నిర్వహించారు. చివరిరోజు విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. శరీర దారుఢ్యానికి మానసిక ఉల్లాసానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అదే విధంగా కరాటే ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ ఆకెళ్ల, డాక్టర్ కోటేశ్వర్‌రావు,విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతో పాటు.. ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి



విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న టర్కీ రాయబారి

శంకర్‌పల్లి: విద్యార్థులు చదువుపైనే కాకుండా ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని డా.మంజుల అన్నారు. శనివారం మండలంలోని జన్వాడలో వాల్మీకి ఫౌండేషన్ 16వ వార్షికోత్సవం నిర్వహించగా ముఖ్య అతిథులుగా టర్కీ రాయబారి అర్హన్ యల్మన్ ఓకాన్ దంపతులు, ప్రముఖ గైనాకాలజిస్ట్ పద్మశ్రీ డా.మంజుల, డా.రోహిణి, డా.శివానందరెడ్డి, వివేక్‌వర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని 25 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 20 సైకిళ్లు, 1000 బ్యాగులు, 6వేల నోట్‌బుక్స్, స్టేషనరీ అందజేశారు. అనంతరం టర్కీ రాయబారి మాట్లాడుతూ.. ఫౌండేషన్ సేవలను కొనియాడారు. విద్యార్థులను కలుసుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఫౌండేషన్ చైర్మన్ గణేశ్, కార్యదర్శి హరికిషన్, పుష్పలను ప్రత్యేకంగా అభినందించారు. మండల విద్యా ధికారి అక్బర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం వాల్మీకి ఫౌండేషన్ చేస్తున్న సేవలు అమోఘమన్నారు. ఫౌండేషన్ సేవల ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులు లబ్ధి పొందుతున్నారని గుర్తు చేశారు. ఫౌండేషన్ తరఫున సమాజానికి సేవ చేస్తున్న పలువురికి సేవాగురు–2024 అవార్డులను అందించారు. వైస్ ఎంపీపీ ప్రవళిక, జన్వాడ ఎంపీటీసీ నాగేందర్, మిర్జాగూడ ఉన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: పురపాలక అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని 11వ వార్డులో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. పట్టణంలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తెస్తే.. వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. పుర వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణాలను చేపట్టి, రవాణా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తాగునీటి నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగానే బోర్లను మరమ్మతు చేయిస్తున్నామని, పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చైర్మన్ వెల్లడించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎదిరే కృష్ణ, నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభ్యున్నతికి సహకరించాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామంలో దివ్యశక్తి రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో రూ.40లక్షలతో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. షాద్‌నగర్ ప్రాంతంలో పారిశ్రామిక వేత్తలు పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి పరిశ్రమలను స్థాపిస్తున్నారన్నారు. పరిశ్రమల యజమానులు స్వలాభాపేక్షతో కాకుండా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. తద్వారా సమాజంలో మంచి ఫలితాలు వస్తాయన్నారు. నిరుపేద విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని దివ్యశక్తి రౌండ్ టేబుల్ సంస్థవారు పాఠశాల భవనాన్ని నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థుల సంక్షేమానికి పరిశ్రమ వారు తమవంతు కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకన్న, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కౌన్సిలర్ కృష్ణవేణి, శ్రీశైలంగౌడ్, బాబర్‌ఖాన్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

'సైబేజ్' సేవలు అభినందనీయం



విద్యార్థులకు స్టేషనరి అందజేస్తున్న సైబేజ్ ప్రతినిధులు

పూడూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు అభినందనీయమని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు అంజిలయ్య అన్నారు. శనివారం మండల పరిధి కెరవెళ్లి, సిరిగాయలపల్లి, సోమన్‌గుర్తి, దేవనోనిగుడ పాఠశాలల్లో హైదరాబాద్ గచ్చిబౌలిలోని సైబేజ్ సాఫ్ట్‌వేర్ సంస్థ ఆధ్వర్యంలో సైబేజ్ ఆశా కార్యక్రమం ద్వారా 250 మంది విద్యార్థులకు బ్యాగులు, నోటుబుక్కులు, వాటర్‌బాటిల్‌ను పంపిణీ చేశారు. గతంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో సంస్థ సీఎస్ఆర్ అనపురపు సురేష్‌కుమార్, సీతారాంరెడ్డి, ప్రతినిధులు వెంకటేశ్, సత్యసాయిరాం, దేవేంద్ర, సాయి, కార్తీక్, సిల్కీ, గుల్షన్, రష్మిత, సంతోష్, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం

పట్టించుకోని అధికారులు



వంతెన కింద చేరిన వరదనీరు



సంపుపై చేరిన వరదనీరు

కొత్తూరు: పట్టణంలోని జాతీయ రహదారి వై జంక్షన్ కూడలి సమీపంలో నిర్మించిన అండర్ పాస్ వంతెన కింద నుంచి వాహనదారులు ప్రమాదం అంచున ప్రయాణిస్తున్నారు. పూర్తిస్థాయిలో పనులు చేయకుండానే వంతెనను అధికారులు ప్రారంభించారు. దీంతో శనివారం పట్టణంలో కురిసిన చిరు వర్షానికే వరదనీరు వంతెన కిందకు చేరింది. దీనికి తోడు వరద నీటిని ఎత్తిపోసేందుకు నిర్మించిన సంపునకు పైభాగంలో ఎలాంటి మూత (మ్యాన్‌హోల్) ఏర్పాటు చేయలేదు. వర్షం కారణంగా సంపు పైభాగం కూడా కనిపించలేదు. దీన్ని గమనించకుండా సంపు సమీపంలో నుంచి వెళ్లే ప్రజలు, ద్విచక్ర వాహనదారులు సంపులో పడి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. వెంటనే సంబంధిత శాఖల అధికారులు స్పందించి సంపుపై కప్పు ఏర్పాటు చేయడంతో పాటు పనులు మొత్తం పూర్తి చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.